తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శుక్రవారం | 7 ఆగస్టు 2026
పేజీలు : 08



# గల్లీ మే కుస్తీ.. ఢిల్లీ మే దోస్తీ

## బీసీ రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తేవాలి: కవిత

- సామాజిక న్యాయమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- బీసీలకు 50 శాతం చట్టసభ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్
- బడ్జెట్ సమావేశాల లోపు బీసీ బిల్లు ఆమోదించాలి
- లేదంటే వెయ్యి కార్లతో 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం

**ఎల్బీనగర్, ఆగస్టు 6 (జనంసాక్షి):**
సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఉద్యమాన్ని చేపడతామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్ సమావేశాల లోపు బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని, లేదంటే వెయ్యి కార్లతో 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో కవిత మాట్లాడారు. ఈ సభ దేశవ్యాప్తంగా సామాజిక న్యాయ ఉద్యమానికి నాంది పలుకుతుందని, రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక న్యాయం ఇంకా పూర్తిస్థాయిలో అమలుకాలేదని పేర్కొన్నారు.
సామాజిక న్యాయం అంటే కొద్దిమందికే అవకాశాలు కల్పించడం కాదని, సమాజంలోని ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు, సమాన భాగస్వామ్యం కల్పించడమేనని చెప్పారు. తాను బీసీల హక్కుల కోసం మాట్లాడితే విమర్శలు వస్తున్నాయని, అయితే ఎవరి కోసం పని చేయాలన్నది తన నిర్ణయమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల గురించి మాట్లాడుతోందని, కానీ బీసీ ముస్లింల అంశాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. బీసీలకు నిజమైన సామాజిక న్యాయం జరగాలంటే 50 శాతం చట్టసభ రిజర్వేషన్లు తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలను ఉద్దేశించి "గల్లీ మే కుస్తీ.. ఢిల్లీ మే దోస్తీ" అంటూ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో పరస్పరం విమర్శించుకుంటూ, ఢిల్లీలో మాత్రం కలిసి మిగితా 2లో

### సభలో ఆమోదించిన ప్రధాన తీర్మానాలు

- బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి.
- బీసీ బిల్లును బడ్జెట్ సమావేశాల లోపు ఆమోదించాలి.
- ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి.
- మహిళలకు డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.
- మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలకు భారతరత్న ప్రకటించాలి.
- ఆదివాసీలు, ముస్లింలు, ట్రాన్స్‌జెండర్లు, వికలాంగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలదే కీలక పాత్ర

- చందానగర్ పరిధిలో 26 సీసీ కెమెరాల ప్రారంభం : డీసీపీ చింతమనేని శ్రీనివాస్
- ప్రజల సహకారంతో భద్రతా వ్యవస్థ మరింత బలోపేతం
- సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తులు తప్పించుకోలేరన్న డీసీపీ
- ప్రతి కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్యం



**శేరిలింగంపల్లి, ఆగస్టు 6 (జనంసాక్షి):**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. సీసీ కెమెరాల విస్తరణతో నేరాలను అరికట్టడంతో పాటు నేరస్తుల్లో భయాన్ని కలిగించగలుగుతున్నామని పేర్కొన్నారు.
చందానగర్ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ ఎక్స్‌రోడ్, హుడా కాలనీ చౌరస్తా, ఆర్‌యూబీ చౌరస్తా, నల్లగండ్ల అండర్‌బ్రిడ్జి, లింగంపల్లి రైల్వే స్టేషన్, లింగంపల్లి రైతు బజార్, కూకట్‌పల్లి ఎక్స్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 26 సీసీ కెమెరాలను ఏసీపీ సీహెచ్‌వై శ్రీనివాస్తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ఈ సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన రూ.3 లక్షల నిధులను అందించిన సామాజిక సేవకుడు మిర్యాల మిగితా 2లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ

- పేద విద్యార్థుల చదువులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చులకన ఎందుకని ప్రశ్న
- ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపణ
- హక్కులు అడిగే విద్యార్థులపై నిర్బంధ చర్యలు తగవని హెచ్చరిక
- బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం

2

## ప్రేమ వివాహం వివాదం

### ఎమ్మెల్యే కుమారుడి సంచలన ఆరోపణలు

- తనపై, కాబోయే భార్య కుటుంబంపై దాడులు జరిగాయని ఆరోపణ
- తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన
- ప్రాణహాని ఉందంటూ పోలీసు రక్షణ కోరిన సంతోష్ గౌడ్

2










## ట్రంక్ లైన్ రోడ్లకు గ్రహణం!

### వనస్థలిపురం–హయత్‌నగర్ మధ్య తరచూ కుంగుతున్న రోడ్లు

- ప్రమాదకర గుంతలతో ప్రయాణికుల అవస్థలు
- కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా శాశ్వత పరిష్కారం ఏదీ?
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

2

*"రోడ్లు పదేపదే కుంగిపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం. కోట్లాది రూపాయల ప్రజల సొమ్ము ఖర్చవుతున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు కుంగిపోవడానికి గల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలి."*

## పట్టభద్రుల ఓటర్ల నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి

- మంత్రి శ్రీధర్ బాబు పిలుపు
- సర్ పై అప్రమత్తంగా ఉండండి
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి
- బీజేపీ, బీఆర్ఎస్ అదృశ్య స్నేహం
- వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టండి
- ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతల కీలక సమావేశం

2



# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ

**ముషీరాబాద్, ఆగస్టు 6 (జనంసాక్షి):** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాం డ్ చేసింది. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని, లక్షలాది మంది పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని నాయకులు ఆందో ళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీ కాంత్ అధ్యక్షతన "హలో విద్యార్థి – ఛలో హైదరాబాద్" పేరుతో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి సాగర్, నాయకుడు టి. నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని విమర్శించారు. రాష్ట్రం లోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని, డబ్బులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని వేధిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో కూడా ఫీజులు చెల్లించని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హక్కులు అడిగే విద్యార్థులపై నిర్బంధ చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. మహాధర్నా లో రాష్ట్ర, జిల్లా నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రేమ వివాహం వివాదం

- ఎమ్మెల్యే కుమారుడి సంచలన ఆరోపణలు
- తనపై, కాబోయే భార్య కుటుంబంపై దాడులు జరిగాయని ఆరోపణ
- తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన
- ప్రాణహాని ఉందంటూ పోలీసు రక్షణ కోరిన సంతోష్ గౌడ్

**రాజేంద్రనగర్, ఆగస్టు 6 (జనంసాక్షి):** ప్రేమ వివాహం వ్యవహారంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ కుమారుడు సంతోష్ గౌడ్ మీడియా సమావేశంలో పలు ఆరోపణలు చేశారు. మణికొండకు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు రూపా రెడ్డి కుమార్తెతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పటికీ, కుటుంబ పెద్దలు అంగీకరించకపోవడంతో నిశ్చితార్థం చేసుకుని ప్రస్తుతం ఆమె కుటుంబ సభ్యుల వద్ద ఉంటున్నట్లు తెలిపారు. తనపై, కాబోయే భార్య కుటుంబ సభ్యులపై దాడులు చేయించారని, దళితులను దూషించినట్లు తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. తన ఇంటిపై దాడి చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు పేర్కొంటూ, అందుకు సంబంధించిన ఫోన్ సంభాషణల రికార్డింగ్‌లను మీడియాకు వినిపించారు. తనకు, కాబోయే భార్య కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని పేర్కొన్న సంతోష్ గౌడ్, తమకు ఏదైనా జరిగితే తన తండ్రే బాధ్యత వహించాలని అన్నారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించడం లేదని, రాజకీయ ఒత్తిళ్లతో తమపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపిస్తూ, తమకు రక్షణ కల్పించి మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

# పట్టభద్రుల ఓటర్ల నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి

**రంగారెడ్డి, ఆగస్టు 6 (జనంసాక్షి)** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)ను బూత్ స్థాయిలో పార్టీ పట్టును బలోపేతం చేసే కార్యక్రమంగా భావించి క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించా లని సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లిలోని దుర్గా కన్వెన్షన్ హాల్‌లో ఆయన అధ్యక్షతన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల కీలక సమావేశం నిర్వహించారు. రాబోయే "హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్" పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు, సర్ ప్రక్రియ పురోగతిని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షించి క్యాడర్‌కు మంత్రి శ్రీధర్ బాబు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. పాత, కొత్త నాయకులు సమన్వయంతో వ్యవహరించి ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. పట్టభద్రుల్లో ఓటరు నమోదు ప్రాముఖ్యతపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటరు నమోదును చేపట్టాలని, బూత్ స్థాయిలోని ప్రతి గ్రాడ్యుయేట్‌ను పార్టీ శ్రేణులు కలిసేలా కార్పొరేషన్ల చైర్మన్లు, అసెంబ్లీ, పార్లమెంట్ బాధ్యులు, జిల్లా అధ్యక్షులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులతో పాటు సంబంధిత పార్టీ బాధ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక ఉంటుందని, ఈ విషయంలో తుది నిర్ణయం హైకమాండ్‌దేనని తేల్చి చెప్పారు. ప్రతి కార్యకర్త బూత్ స్థాయి నుంచి సమన్వయంతో పనిచేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో చేరేలా మరియు తప్పులను సరిదిద్దేలా సర్ ప్రక్రియపై పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రకాష్ గౌడ్, కసిరెడ్డి నారాయణ రెడ్డి, అరికెపూడి గాంధీ, కార్పొరేషన్ చైర్మన్లు మల్ రెడ్డి రాంరెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బండి రమేష్, డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, నర్సింహా రెడ్డి, ధారా సింగ్తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడుల పేరుతో మోసం.. మహిళ అరెస్ట్

- అధిక లాభాల పేరుతో భారీగా డబ్బులు వసూలు
- నార్సింగి పోలీసులు కేసు నమోదు
- ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగింపు



**రాజేంద్రనగర్, ఆగస్టు 6 (జనంసాక్షి):** పెట్టుబడులపై అధిక లాభాలు వస్తాయని నమ్మించి పలువురి నుంచి భారీ మొత్తంలో నగదు వసూలు చేసి మోసానికి పాల్పడిన పల్లోళ్ల రూపా రెడ్డిని నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రాథమిక దర్యాప్తులో మరికొంత మంది బాధితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మోసపోయిన మొత్తం, ఆర్థిక లావాదేవీలు, నిధుల జాడ, డిజిటల్ ఆధారాలపై సమగ్రంగా విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరచగా, కేసుకు సంబంధించిన ఇతర కోణాలపై కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.



## ప్రజా వ్యతిరేక వ్యతిరేక విధానాలపై సిపిఐ పోరాటం

**నిజాంపేట్ ఆగస్టు 6 జనం సాక్షి :** సిపిఐ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ధర్నా లో భాగంగా సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గురువారం నిజాంపేట్ సర్కిల్ వద్ద బద్నావ్ జరూరి హై (మార్పుకావాలి.) కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా ప్రదర్శన నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ బీజేపీ ఏర్పాటు చేసి 12 సంవత్సరలు దాటినా ఇప్పటికి పేద ప్రజలు, విద్యార్థులు, రైతులు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు. పేద ప్రజలకు వెతిరేకంగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మోడీ పాలనా కొనసాగుతుంది అని గుర్తుచేశారు. సెప్టెంబర్ 1వ తేదీన జంతర్ మంతర్ దగ్గర జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ప్రజల అనుకూల ప్రభుత్వాని ఏర్పాటు చేసుకునే దిశగా మనం ముందుకు పోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట ఏఐటీయూసీ కన్వీనర్ పొన్నకంటి దస్తగిరి, వెంకటేష్, యాకన్న, మల్లన్న, కృష్ణ, యదన్న, నర్సమ్మ, సత్తమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ట్రంక్ లైన్ రోడ్లకు గ్రహణం!

- వనస్థలిపురం-హయత్‌నగర్ మధ్య తరచూ కుంగుతున్న రోడ్లు
- ప్రమాదకర గుంతలతో ప్రయాణికుల అవస్థలు
- కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా శాశ్వత పరిష్కారం ఏది?
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**హయత్‌నగర్, ఆగస్టు 6 (జనం సాక్షి):** వనస్థలిపురం నుంచి హయత్‌నగర్ వరకు ఉన్న ట్రంక్‌లైన్ పరిధిలో రహదారుల పరిస్థితి రోజు రోజుకూ అధ్వానంగా మారుతోంది. తరచూ రోడ్లు కుంగిపోవడం, భారీ గుంతలు ఏర్పడటం, మరమ్మతులు చేసిన కొద్దిరోజులకే మళ్లీ అదే ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినడం నిత్యకృత్యంగా మారింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో రాకపో కలు సాగిస్తుంటాయి. రోడ్డు కుంగిపోయి ఏర్పడిన లోతైన గుంతలు వాహనదారులకు తీవ్ర ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు స్పష్టంగా కనిపించకపో వడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. భారీ వాహనాలు గుంతల్లో దిగడంతో రోడ్డు మరింత దెబ్బతింటుండగా, చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారా?

రోడ్డు కుంగిన ప్రతిసారీ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నప్పటికీ, కొద్ది కాలానికే సమస్య మళ్లీ పునరావృతమవుతోంది. దీంతో ప్రజాధనం వృథా అవుతోంద నే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారులు ఎందుకు తరచూ కుంగిపోతున్నాయి? రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? భూగర్భంలో ఉన్న డ్రైనేజీ, నీటి పైపులైన్లు లేదా ఇతర మౌలిక వసతుల కారణంగా రోడ్లు కుంగుతున్నాయా? అనే అంశాలపై సమగ్ర సాంకేతిక పరిశీల న జరపాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. సమస్యకు మూలకారణాన్ని గుర్తించకుండా ప్రతిసారీ గుంతలను పూడ్చడం, పైపూత వేయడం వంటి తాత్కాలిక చర్యలకే పరిమితమైతే ప్రజల ఇబ్బందులు ఎప్పటికీ తొలగవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా?

రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసం ప్రభుత్వ శాఖలు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నప్పటికీ రోడ్ల నాణ్యతలో మాత్రం గణనీయమైన మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపి స్తున్నారు. ఒకసారి నిర్మించిన రోడ్డు కొన్నాళ్లకే కుంగిపోవడం, మళ్లీ మరమ్మతులు చేయడం, తిరిగి అదే పరిస్థితి ఏర్పడటం వల్ల ప్రజల సొమ్ము వృథా అవుతోందని వారు పేర్కొంటు న్నారు. ప్రజాధనం తో చేపడుతున్న రహదారి పనులపై అధికారులు కఠినంగా పర్యవేక్షణ చేయాలని, పనుల నాణ్యత ను తనిఖీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్ట ర్లు నాసిరకం పనులు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, నాణ్యతా ప్రమాణాలు పాటించని పనులకు బాధ్యులైన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకం

వనస్థలిపురం–హయత్‌నగర్ మార్గం నగరంలోని కీలక రహదారుల్లో ఒకటిగా ఉండటంతో నిత్యం భారీగా ట్రాఫిక్ ఉంటుంది. ఇలాంటి ప్రధాన రహదారిపై ప్రమాదకర గుంత లు ఏర్పడటం వల్ల వాహనదారులు ఒక్కసారిగా బ్రేకులు వేయడం, గుంతలను తప్పించేందుకు వాహనాలను పక్కకు మళ్లించడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనాలతో ఢీకొనే ప్రమాదం కూడా ఉంది. ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, మహిళలు, పిల్లలతో ప్రయాణించే వారు మరింత ఇబ్బందులు పడుతున్నారు. వర్షం సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు.



గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాటి లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

రోడ్డు కుంగిపోవడానికి గల అసలు కారణాన్ని గుర్తించి, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, నీటి పైపులైన్లు, రహదారి పునాది తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైతే నిపుణుల కమిటీతో సాంకేతిక సర్వే నిర్వహించి, రహదారిని పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలికంగా గుంతలను పూడ్చడం వల్ల సమస్య పరిష్కారం కాదని, భవిష్యత్తులో మళ్లీ రోడ్డు కుంగిపోకుండా నాణ్యమైన నిర్మాణంతో శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డు పనులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, పనుల నాణ్యతకు బాధ్యత వహించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల తక్షణ స్పందన అవసరం

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదకరంగా మారిన గుంతలను వెంటనే గుర్తించి పూడ్చడంతో పాటు, రహదారి తరచూ ఎందుకు కుంగిపోతుందో సమగ్రంగా అధ్యయనం చేసి శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రతతో పాటు ప్రజాధనం వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మరింత తీవ్రమైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

# 30 ఏళ్లుగా నరకప్రాయం: ఒకే రోడ్డు.. ఏడు గ్రామాల శాపం

## శాశ్వత సీసీ రోడ్డు వేయాలంటూ ప్రజా గ్రహం



**యాచారం, ఆగస్టు 6(జనం సాక్షి )** ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా యాచారం మండల ప్రజల మూడు దశాబ్దాల రోడ్డు కష్టాలు మాత్రం తీరడం లేదు. యాచారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి నంది వనపర్తి వెళ్లే ప్రధాన రహదారి గత 30 ఏళ్లుగా కొత్త రోడ్డుకు నోచుకోక పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ ఏడు గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. చిన్నపాటి వర్షం పడినా రోడ్డుపై ఉన్న గుంతలన్నీ నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, రాత్రి వేళల్లో గుంతలు కనిపించక నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇది మట్టి రోడ్డు కావడంతో ఎండకాలంలో వాహనాలు వెళ్లేటప్పుడు ఎగిసే దుమ్ము, ధూళి వల్ల స్థానికులు తీవ్ర శ్వాసకోశ, అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. సమస్యపై స్థానికులు, వాహనదారులు ఎప్పుడు నిరసనలు, ఆందోళనలు చేసినా అధికారులు కేవలం నామమాత్రంగా మట్టి, కంకర పోసి చేతులు దులుపుకుంటున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. వర్షం రాగానే ఆ కంకర కొట్టుకుపోయి రోడ్డు మళ్లీ పాత స్థితికి చేరుకుంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులు కాకుండా, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ శాశ్వతంగా సీసీ రోడ్డు నిర్మించి తమ ప్రాణాలు కాపాడాలని ఏడు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఉప్పల్ భగత్ ప్రవేశ ద్వారం వద్ద అధ్వానంగా మారిన రహదారి

## గుంతలు, ఎగుడుదిగుడు రహదారితో నిత్యం నరకయాతన.. దుమ్ము, బురదతో తీవ్ర ఇబ్బందులు



**ఉప్పల్, ఆగస్టు 6 (జనం సాక్షి):** ఉప్పల్ భగత్ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా మారి ప్రయాణికులు, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారిపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు, ఎగుడుదిగుడుగా మారిన ఉపరితలం కారణంగా వాహనదారులు ప్రతిరోజూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలంలో ఈ రహదారి పూర్తిగా బురదమయంగా మారి వాహనాలు జారిపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పాదచారులు కూడా నడవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఎండాకాలం, పొడి వాతావరణంలో దుమ్ము దట్టంగా ఎగసిపడుతూ పరిసర ప్రాంతాలను కమ్మేస్తోంది. దీంతో ప్రయాణికులు, స్థానిక నివాసితులు, వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ధూళి కాలుష్యం కారణంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలు కూడా తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఈ మార్గంలో ప్రతిరోజూ ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, అత్యవసర సేవల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రహదారి దుస్థితి కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటమే కాకుండా, ప్రయాణ సమయం కూడా పెరుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత ఎక్కువగా ఉందని పేర్కొంటున్నారు.స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చడం కాకుండా నాణ్యమైన రహదారిని నిర్మించి ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించాలని కోరుతున్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి, గుంతలను పూడ్చి, దుమ్ము, బురద సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని స్థానికులు, వాహనదారులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రహదారి మరమ్మతుల కోసం స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# తాండూరు నియోజకవర్గంలో అభివృద్ధి జోరు

## ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నాయకత్వంలో వేల కోట్ల పనులు



**తాండూరు అగస్టు 6(జనంసాక్షి)** ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి నాయకత్వంలో తాండూర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని కాంగ్రెస్ పార్టీ తాండూరు సర్ కన్వీనర్ కరణం పురుషోత్తం రావు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, నీరు, విద్య, ఉపాధి ఇలా ప్రతి రంగంలోనూ వేల కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న ప్రధాన అభివృద్ధి పనులను పరిశీలిస్తే, రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. రూ. 46 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టగా, ఆర్ అండ్ బి శాఖ ద్వారా మరో రూ. 628.53 కోట్లతో ప్రధాన రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. తాండూర్ మున్సిపాలిటీలోని 8, 9 వార్డుల్లో రూ. 1.50 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. వినాయక్ కన్వెన్షన్ నుండి రైల్వే ట్రాక్ వరకు రూ. 2 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం కూడా చేపట్టారు.సాగునీటి రంగంలోనూ పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నారు. కోటెపల్లి ప్రాజెక్టుకు రూ. 89.6 కోట్లు, జంబుపల్లి ప్రాజెక్ట్ కాలువకు రూ. 5.71 కోట్లు మంజూరు చేశారు. అలాగే రూ. 4.8 కోట్లతో గొల్ల చెరువు కాలువ పనులు జరుగుతున్నాయి.గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేశారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 189.52 కోట్లతో గ్రామాలను అభివృద్ధి చేస్తుండగా, ాణఖీ నిధుల ద్వారా రూ. 21.44 కోట్లు,డిఎంఎఫ్ టి నిధుల ద్వారా రూ. 23.10 కోట్లతో గ్రామాలు, తాండూర్ మున్సిపాలిటీలో వివిధ పనులు చేపట్టారు. ఎంజిఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ ద్వారా రూ. 83.14 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు, ఎస్.హె.జీ భవనాలు, స్కూల్ కాంపౌండ్ వాల్స్, పంచాయతీ భవనాలు, మోక్షధామాల నిర్మాణం జరుగుతుందన్నారు .పేదల సంక్షేమంలో భాగంగా 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తాండూర్‌లో దాదాపు రూ. 45 కోట్లతో ఎటిసి సెంటర్ నిర్మిస్తున్నారు. విద్యా రంగంలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, విద్యుత్ రంగంలో రూ. 19.27 కోట్లతో 6 కొత్త ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎన్.టి.ఆర్ కాలనీ, ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్, రాజీవ్ కాలనీలో రూ. 27.50 కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టారు.మొత్తంగా తాండూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

# మొండిగౌరెల్లిలో భూముల రీసర్వే ప్రారంభం

## నకిలీ రికార్డులపై సర్పంచ్ ఫిర్యాదుతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం



**యాచారం, ఆగస్టు 6(జనం సాక్షి )** మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో గల సర్వే నంబర్ 127, 19, 68 పరిధిలోని అసైన్డ్ భూములపై గురువారం రెవెన్యూ అధికారులు సమగ్ర రీసర్వేను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి, పాలకవర్గ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక తహసీల్దార్ అయ్యప్పలతో కలిసి క్షేత్రస్థాయిలో సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, 1972 నుంచి ఇప్పటివరకు జరిగిన భూ కేటాయింపులు, ప్రస్తుత సాగు వివరాల రికార్డులను పారదర్శకంగా సరిపోల్చి చూస్తున్నామని తెలిపారు. నకిలీ పత్రాలు సృష్టించి భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అర్హులైన అసలైన పేద రైతులకు పూర్తి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జయశంకర్ జయంతి

## తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయం



**హయత్‌నగర్, ఆగస్టు 6 (జనం సాక్షి)**తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేష్‌బాబు జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థిగా, అధ్యాపకుడిగా, వైస్‌చాన్స్‌లర్‌గా, ఉద్యమకారుడిగా తెలంగాణకు జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన జీవితాంతం అంకితభావంతో పనిచేశారని కొనియాడారు.రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డా. డి. శ్రీపతి నాయుడు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలు, అసమానతలను ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకువచ్చిన మహనీయుడు జయశంకర్ అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మేధోపరమైన పునాది వేసిన ఆయన జీవితం విద్యార్థినీ విద్యార్థులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్‌రెడ్డి, ఇందిర, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. బి. నరసింహ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. డి. మధు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. ఇ. యాదగిరిరెడ్డి, డా. ఎస్. శారదాదేవి, ఫిజికల్ డైరెక్టర్ డా. కె. అనితతో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# చెత్తకుండీలో గుర్తుతెలియని మృతదేహం



**ముషీరాబాద్, ఆగస్టు 06 (జనం సాక్షి)**హైదరాబాద్‌లోని కవాడిగూడ డీబీఆర్ మిల్స్ ప్రాంతంలోని చెత్తకుండీలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమవడంతో బుధవారం అర్ధరాత్రి స్థానికంగా కలకలం నెలకొంది.స్థానికుల కథనం ప్రకారం, అర్ధరాత్రి సమయంలో చెత్తకుండీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన స్థానికులు అక్కడికి చేరుకుని పరిశీలించగా, చెత్తకుండీలో మృతదేహం కనిపించింది. దీంతో వెంటనే దోమల్‌గూడ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు పురుషుడా, మహిళా అనే విషయంతో పాటు, మృతి హత్య వల్ల జరిగిందా లేదా ఆత్మహత్యా అనే కోణంలో విచారణ చేపట్టారు. మృతదేహంపై ఎలాంటి గుర్తింపు ఆధారాలు లభించకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దోమల్‌గూడ పోలీసులు, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహం గుర్తింపునకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# యాలాల మండల కాంగ్రెస్‌లో ఎలాంటి విభేదాలు లేవు

### యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.వీరేశం



**యాలాల అగస్టు 6 ( జనంసాక్షి ) :** యాలాల మండలంలో కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని యాలాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.వీరేశం స్పష్టం చేశారు.కావాలనే కొందరు పార్టీ పట్ల బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పార్టీ నాయకులంతా సమన్వయంతో పనిచేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేయడమే అందరి లక్ష్యమని వీరేశం తెలిపారు.కొంతమంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీలో చీలికలు ఉన్నట్టుగా ప్రచారం చేస్తున్నారని, అలాంటి వాటిని కార్యకర్తలు నమ్మవద్దని ఆయన కోరారు. యాలాల మండలంలో కాంగ్రెస్ కుటుంబం మరింత బలంగా ఉందని, అందరం కలిసికట్టుగా పార్టీని ముందుకు తీసుకెళ్తామని పి.వీరేశం పేర్కొన్నారు.

# దావఖాన నిర్మించుటకు నిరాహార దీక్ష

### మెరుగైన వైద్యం లేక ప్రజలు మృతి చెందుతున్నారు



**జిల్లేడు చౌదరి గూడ అగస్టు 6 ( జనంసాక్షి ).** ప్రభుత్వదావఖానలో ఉన్న మెరుగైన వైద్యం అందడం లేదని జిల్లా సాధన సమితి పేర్కొంది ఉమ్మడి కొందుర్గు మండల కేంద్రంలో గత 30 సంవత్సరాల నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంది ఇందులో సిబ్బంది కొరత మందుల కొరత ఎప్పటికీ ప్రజలకు ఎదురవుతుంది రోడ్ల పైన యాక్సిడెంట్లు జరుగుతే బడ దావకానాలకు రిఫర్ చేస్తున్నారు అదే దావఖాన మండలంలో ఏర్పాటు చేయాలని సాధన సమితి కోరుతుంది 24 పడకల మల్టీ స్పెషాలిటీ దవఖా ప్రభుత్వం ఏర్పాటు చేసి అత్యవసర చికిత్స, స్పెషాలిటీ వైద్యులను ఏర్పాటు చేయాలని డిమాండ్ వ్యక్తం చేశారు. ఈ హామీ ప్రభుత్వం నెరవేర్చినంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని జిల్లా సాధన సమితి శపథం చేస్తుంది. ఈ కార్యక్రమంలో సంతోష్. మాజీ సర్పంచ్ వెంకటయ్య. తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ఒకే సమయసారణి అమలు చేయాలి



**యాచారం,ఆగష్టు 06(జనం సాక్షి )**గురుకుల పాఠశాలల్లో ఒకే రకమైన సమయసారణి ని అమలు చేయాలని, రాత్రి వేళ విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులకు మరుసటి రోజు సెలవు మంజూరు చేయాలని తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర మీడియా కో-కన్వీనర్ సత్తారి రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్‌లు మాట్లాడారు. విద్యారంగ, ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1న నిర్వహించిన రాష్ట్ర మహా ధర్నాకు మద్దతు తెలిపిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే పీఆర్సీ ని ప్రకటించాలని, సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అలాగే పెండింగ్ బిల్లులు, డీఏల విడుదల, ఎస్ఎస్ఏ, కేజీబీవీ, మోడల్ స్కూల్, 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2010కి ముందు నియమితులైన వారికి టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల శివకుమార్, కావలి దత్తాత్రేయ, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు రావుల వెంకటేష్, యాదగిరి, రవీందర్ రావు, సుమలత, విజయ జ్యోతి, జంగయ్య, మల్లేష్, రాములు, రాజ వర్ధన్ రెడ్డి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఆలయాలకు బోనాల చెక్కుల పంపిణీ

### ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ఆలయాలకు ప్రత్యేక ప్రాధాన్యత



**ఉప్పల్, ఆగస్టు 6 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన బోనాల చెక్కులను గురువారం హబ్సిగూడలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా పంపిణీ చేశారు. ఆలయ కమిటీల ప్రతినిధులకు బోనాల చెక్కులను వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంయుక్తంగా అందజేశారు.ఈ కార్యక్రమానికి వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. ఆలయ కమిటీల సభ్యులు, భక్తులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొంటూ, ఈ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు. ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి ఆలయానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని చెప్పారు. ఆలయాల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలను దశలవారీగా చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన బోనాల చెక్కులు ఆలయాల నిర్వహణకు, పండుగల నిర్వహణకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.అనంతరం ఆలయ కమిటీల ప్రతినిధులకు బోనాల చెక్కులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భక్తుల సౌకర్యార్థం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లతోనే నిజమైన సాధికారత

### మౌలాలిలో ఘనంగా మహిళా రాజకీయ తరగతులు



**మల్కాజిగిరి ఆగస్టు 6(జనంసాక్షి)**చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేసినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఐద్వా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షురాలు నన్నపనేని సృజన పేర్కొన్నారు. మౌలాలి భరత్ నగర్‌లో చల్లా లీలావతి అధ్యక్షతన ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా రాజకీయ తరగతుల్లకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.రక్షణ రంగం నుంచి పైలట్లుగా అన్ని రంగాల్లో మహిళలు విశేష సేవలు అందిస్తున్నప్పటికీ చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లేకపోవడం విచారకరమన్నారు. సమాజంలో పెరిగిపోతున్న మద్యం, డ్రగ్స్ సంస్కృతి వల్లే మహిళలు, పిల్లలపై దాడులు ఎక్కువవుతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు.ఐద్వా జిల్లా కార్యదర్శి మద్దెల వినోద మాట్లాడుతూ.ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారెంటీల అమలు సరిగ్గా జరగడం లేదని విమర్శించారు. పేదల గుడిసెల కూల్చివేతలను వెంటనే ఆపి,ఎలాంటి షరతులు లేకుండా ఇండ్ల స్థలాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కోమటి రవి మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం కులమతాలకు అతీతంగా మహిళలు పోరాడాలని పిలుపునిచ్చారు.అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి మైనారిటీ నాయకురాలు నూర్ భాను పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు పిట్టల మంగా, నరసమ్మ, ప్రవీణ్, శారద, సుశీల, శివకుమారి, అనురాధ, రాధ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొ.జయశంకర్ సార్ ఆకాంక్షలకు అనుగుణంగా పాలన జరగాలి



**తాండూరు అగస్టు 6(జనంసాక్షి)**ప్రొ. జయశంకర్ సార్ 92వ జయంతి సంధర్బంగా ఇందిరా చౌక్ లోని జయశంకర్ సార్ విగ్రహం వద్ద తెలంగాణ జన సమితి, ప్రజాసంఘాలు,విద్యావంతుల వేదిక, ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సంధర్భంగా మునిసిపాలిటీ మాజీ కౌన్సిలర్,టిజే ఎస్ ఇంచార్జ్ సాంబురు సోమశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితం త్యాగం చేసిన వ్యక్తి ప్రొ. జయశంకర్ సార్ అని, గత ప్రభుత్వం ఆయనను విస్మరించింది, ఇప్పటి ప్రభుత్వం ఆయన జయంతి అధికారికంగా నిర్వహిస్తున్నా, కానీ ఆయన జీవిత చరిత్ర,ఆలోచన విధానం నేటి తరం యువకులకు, విద్యార్థులకు చేరేవిధంగా జయంతి నాడు కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అన్నారు, జయశంకర్ సార్ ఆశయాలకు అనుగుణంగా పాలన జరగాలని,ప్రజాస్వామ్య తెలంగాణ సాధనలో అందరూ భాగం కావాలని, జయశంకర్ సార్ స్ఫూర్తితో ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి అని, ప్రభుత్వం ఉద్యమకారులకు, నిరుద్యోగులకు న్యాయం చేయాలని వారిని విస్మరిస్తే మరో ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు.తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. విజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని యావత్ ప్రజలకు వివరించి చైతన్యపరిచి,ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగం చేసి రాష్ట్ర సాధనకు మార్గదర్శనం చేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని, వారి ఆశయాలు నేటి తరానికి తెలిసే విధంగా ప్రభుత్వం, బుద్ధిజీవులు కృషి చేయాలి అని ఆయన అన్నారు .అధ్యాపకులు పర్యాద రామకృష్ణ మాట్లాడుతూ జయశంకర్ సార్ జీవితం ఏ తరం కోసమైతే త్యాగం చేసారో ఆ తరానికి ఆయన జీవిత చరిత్ర తెలియాల్సిన అవసరం ఉంది అని, ఆయన ఆశయాల అనుగుణంగా తెలంగాణ పునర్నిర్మాణంలో అందరం భాగం కావాలని ఆయన కోరారు. సీఐటీయూ నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ జయశంకర్ ఆశయాల అనుగుణంగా అణగారిన వర్గాలకు,కార్మిక, కర్షకులకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాకారుడు బలరాం పాటలు అందరిని ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో మునిసిపాల్ సానిటరీ ఇన్స్పెక్టర్ రాములు, జనసమితి నాయకులు గౌరీ, సందీప్,విద్యావంతుల వేదిక నాయకులు చెనిమిళ్ల విజయ్ కుమార్ జీలకర్ర రవీందర్, అధ్యాపకులు రవీందర్ రెడ్డి, రాజశేఖర్,గాయకుడు బలరాం , ఉద్యమ నాయకులు ఫిరోజ్ ఖాన్, వెంకట్ , ఆర్టీసీ కార్మిక నాయకుడు యాలిశెట్టి వీరప్ప మునిసిపాల్ జవాన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తాండూర్ బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం



**తాండూరు అగస్టు 6(జనంసాక్షి)**తాండూర్ పట్టణ బొడ్రాయి కమిటీ ఆధ్వర్యంలో తాండూర్ పట్టణంలో తృతీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి , తాండూర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆధ్యాత్మికతకు ప్రతీకగా.ఐక్యతకు వేదికగా..భక్తి భావంతో తాండూర్ బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది.

# సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

### అనుమానాస్పద లింకులు, ఏపీకే ఫైళ్లను ఓపెన్చేయొద్దు

### సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ నాగాచారి




**హయత్ నగర్, ఆగస్టు 6 (జనం సాక్షి)**సైబర్ నేరాల పట్ల విద్యార్థినీ, విద్యార్థులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ ఆన్‌లైన్ మోసాలు కూడా పెరుగుతున్నాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సురేష్ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎల్‌బీనగర్ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నాగాచారి విద్యార్థులకు సైబర్ మోసాలు ఏ విధంగా జరుగుతున్నాయో వివరించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి మొబైల్ ఫోన్లకు వచ్చే అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని సూచించారు. అదేవిధంగా తెలియని వ్యక్తులు పంపించే ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయవద్దని హెచ్చరించారు.సోషల్ మీడియాను వినియోగించే సమయంలో వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయవద్దని, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర రహస్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా ప్రజలను మోసం చేస్తున్నారని, గుర్తుతెలియని ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.అనుకోకుండా సైబర్ మోసానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా పోలీసులను ఆశ్రయించాలని, మోసానికి సంబంధించిన ఫోన్ నంబర్లు, మెసేజ్‌లు, లావాదేవీల వివరాలు వంటి ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను సైబర్ క్రైమ్ అధికారులు నివృత్తి చేశారు. ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సీఐ శంకరయ్య, ఎస్సై కె. వెంకట్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్సై శివకుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. ఇ. యాదగిరి రెడ్డి, డా. ఎస్. శారదాదేవి, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాకవి గద్దర్‌కు ఘన నివాళులు

### రాఘవేంద్ర కాలనీ చౌరస్తాలో పుష్పాంజలి.. రెండు నిమిషాల మౌన నివాళి



**ఉప్పల్, ఆగస్టు 6 (జనం సాక్షి):** ప్రజాకవి, ప్రజాగాయకుడు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత గద్దర్ (గుమ్మడి విట్టల్ రావు) 3వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం రాఘవేంద్ర కాలనీ చౌరస్తాలో ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించిన అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం గద్దర్ తన జీవితాన్నే అంకితం చేశారని కొనియాడారు. తన పాటల ద్వారా కోట్లాది ప్రజల్లో చైతన్యం నింపిన గద్దర్, తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజాకవి, ప్రజా గాయకుడు, సామాజిక ఉద్యమకారుడిగా ఆయన చూపిన మార్గం భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ సేవలను చిరస్మరణీయంగా నిలిపేందుకు పలు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా "గద్దర్ అవార్డులు" ఏర్పాటు చేసి కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని సత్కరించడం గద్దర్ పట్ల ప్రభుత్వం చూపుతున్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు.సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గద్దర్ ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ బజార్ జగన్నాథ్ గౌడ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సందీప్ భూషణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డా. ఏడ్ల అంజయ్య, నాగరాజు, ఆర్థిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. దుబ్బ రంజిత్, డా. ఆర్.ఎన్. శంకర్, డా. కిరణ్ సుకినే, సతీష్, డా. రాజీవ్, డా. గొర్రె రాజు, యువ నాయకుడు ఎం.డి. అష్రఫ్, పవన్, శ్రీకాంత్, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని గద్దర్‌కు ఘన నివాళులర్పించారు.కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు."గద్దర్ ఆశయాలు చిరంజీవి... సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన చూపిన మార్గం శాశ్వత స్ఫూర్తి."

# ఇంటింటికీ చెత్త సేకరణ తప్పనిసరి



ఉప్పల్ / రామంతపూర్, ఆగస్టు 6 (జనం సాక్షి):మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యత ఇస్తూ అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా రామంతపూర్‌లోని దేవేంద్రనగర్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కాలనీల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించిన కమిషనర్, ఇంటింటికీ చెత్త సేకరణ ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు.డోర్-టు-డోర్ చెత్త సేకరణ సేవలను ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాట్ ఆటో డోర్-టు-డోర్ కలెక్షన్ వ్యవస్థ ద్వారా చెత్తను అందించని ఇళ్లను గుర్తించి, ఆయా కుటుంబాలకు అవగాహన కల్పించి తప్పనిసరిగా ఈ సేవలో భాగస్వాములను చేయాలని సూచించారు.ప్రతి ఇంటి నుంచి తడి, పొడి వ్యర్థాలను క్రమబద్ధంగా సేకరించే విధంగా సిబ్బంది పనిచేయాలని, చెత్త సేకరణలో ఎలాంటి అంతరాయం లేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బహిరంగ చెత్త పారవేతపై కఠిన చర్యలుకాలనీలు, ప్రధాన రహదారులు, ఖాళీ స్థలాలు, అక్రమంగా చెత్త పార వేయడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడటంతో పాటు పరిసరాల పరిశుభ్రత దెబ్బ తింటుందని పేర్కొన్నారు .బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, నిరంతరం తనిఖీలు నిర్వహించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పారిశుధ్య కార్యక్రమాల అమలులో ప్రజల సహకారం ఎంతో అవసరమని కమిషనర్ తెలిపారు.ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన నగరంనగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని కమిషనర్ పేర్కొన్నారు.రామంతపూర్ దేవేంద్రనగర్‌లో నిర్వహించిన ఈ తనిఖీల సందర్భంగా మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి




**యాచారం , ఆగస్టు 6(జనం సాక్షి ):**సైబర్ నేరాల పట్ల విద్యార్థులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని గ్రీన్ ఫార్మాసిటీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కురుమిద్ద ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ భద్రతపై గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంకేతికత పెరుగుతున్న నేటి కాలంలో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వాడకంపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయాలు ప్రమాదకరమని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా ఫిర్యాదు చేయాలని సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సైదులు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ అండగా ఉంటుంది

### సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్



**చేవెళ్ల,ఆగస్టు 06 ఆగస్టు 06 (జనంసాక్షి)** పాఠశాలల్లోని బాలబాలికలు స్నేహపూర్వకంగా మెలగడంతో పాటు మంచి విలువలు అలవర్చుకుంటేనే గ్రామాభివృద్ధికి భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తారని రావులపల్లి గ్రామ సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్న ఏకరూప దుస్తులను బుధవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారం, వారి అవసరాల తీర్చడంలో గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. నేటి బాలలే రేపటి బాధ్యతాయుత పౌరులని, క్రమశిక్షణతో పాటు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో బాలల సభను నిర్వహించి, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఆవిర్భావంలో ఆచార్య జయశంకర్ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుమిత్ర, ముడిమ్యాల పీఏసీఎస్ డైరెక్టర్ క్యాసారం నరేందర్, వార్డు సభ్యులు కావలి జ్యోతి, కుమ్మరి గోపాల్, గ్రామ పెద్దలు పట్లోళ్ల నాగిరెడ్డి, గోటూరి విజయ్ కుమార్ గౌడ్, పల్లె అశోక్, బుర్ల అంజన్ కుమార్, శ్రీశైలం కుమార్, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆశీర్వాదం, ఉపాధ్యాయులు లక్ష్మణ్, నర్సింలు, మహిళా సంఘాల ప్రతినిధులు మంజుల, మహేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



**మొయినాబాద్,ఆగస్టు06జనంసాక్షి:**మొయినాబాద్ పరిధిలోని పలు గ్రామాల్లో ఆషాఢ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో చిన్నారులు సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకోగా.. పోతురాజుల నృత్యాలు భక్తులను అలరించాయి. డప్పు చప్పుళ్ల మేళతాళాల మధ్య గ్రామస్తులు భక్తులను స్వాగతించారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి గ్రామ ప్రజల సుఖసంతోషాలు, సమృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించారు. ఉత్సవాల్లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.

## పప్పెట్స్ ద్వారా వినూత్న విద్యా బోధన




**బొంరాస్ పేట, ఆగస్టు 6 (జనం సాక్షి):** సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ మార్గదర్శకాల మేరకు గురువారం వడిచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో 1,2,3,4, 5వ తరగతి విద్యార్థులకు పప్పెట్స్ ద్వారా వినూత్న విద్యాబోధన నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పప్పెట్స్ ను ఉపయోగించి పాఠ్యాంశాలను బోధించడంతో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాఠాలను అభ్యసించారని, బోధనలో చురుకుగా పాల్గొంటూ అభ్యసనాన్ని ఆనందదాయకంగా అనుభవించారన్నారు. ఈ విధమైన సృజనాత్మక బోధనా పద్ధతులు విద్యార్థులలో అభ్యసన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, పెంపొందించడంతోపాటు పాఠ్యాంశాలపై అవగాహనను మరింత మెరుగుపరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింలు, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

## జడ్జెస్ కాలనీలో శ్రీ బంగారు పోచమ్మ రేణుక ఎల్లమ్మ దేవాలయ కళ్యాణ మహోత్సవం



**హయత్ నగర్, ఆగస్టు 6 (జనం సాక్షి)**మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జడ్జెస్ కాలనీ ఫేజ్--1లో శ్రీ బంగారు పోచమ్మ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, దేవాలయ నిర్వాహకులు, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సంకల్పం దృఢంగా ఉండాలి

### విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి



**మహేశ్వరం,ఆగస్టు6(జనంసాక్షి):** విద్యార్థులకు సంకల్పం దృఢంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సర్దార్ నగర్ గ్రామానికి చెందిన ఈదులకంటి చిరంజీవి గౌడ్ విద్యార్థుల కోసం 25 లక్షలు రూపాయలు విలువ చేసే బస్సును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి,డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... విద్యార్థులు గొప్ప గొప్ప లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఏదైనా సులభంగా సాధిస్తారన్నారు. విద్యార్థులు జీవితంలో మంచిగా స్థిరపడాలంటే మంచిగా చదువు,ఆటలల్లో ముందు ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలకు ఈదులకంటి చిరంజీవి గౌడ్ 25 లక్షలు విలువ చేసే బస్సును బహుమతి ఇవ్వడం సంతోషనియమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బతికించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ను జిల్లా వ్యాప్తంగా తర్వలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కస్నా నాయక్,వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ జాపాల సుధాకర్,ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, స్కూల్ చైర్మన్ వనిత వెంకటేష్ గౌడ్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోచంపల్లి లో అభివృద్ధి పనుల ను ప్రారంభించిన హనుమంత్ రెడ్డి



**నిజాంపేట్ ఆగస్టు 6 (జనం సాక్షి):**కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బహదూర్‌పల్లి 294వ డివిజన్ పరిధిలోని పోచంపల్లి గ్రామంలో ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి లికుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో సిఎంసి నిధుల నుంచి రూ.82 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. మంజూరైన పనుల్లో సురక్ష గ్రీన్ మెడోస్ రోడ్డు అభివృద్ధికి రూ.20 లక్షలు, గాయత్రీ ఇండస్ట్రీస్ 66 నుండి హోలీ చైల్డ్ స్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు, మేడ్చల్ రోడ్డు నుండి గాయత్రీ నగర్ కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.32 లక్షలు, యూజీడీ (యూజీడి) పనులకు రూ.15 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, డివిజన్‌లోని ప్రతి కాలనీ, ప్రతి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులను కూడా తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిశోర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ అమరం ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ రామగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్, మాజీ వార్డు సభ్యుడు తిరుపతి రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ నాయకులు సదానంద్, కాలనీ నాయకులు కిషన్ రెడ్డి, ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనురాగ్ యూనివర్సిటీలో మాదకద్రవ్యాలు, ర్యాగింగ్ నిరోధక-రోడ్డు భద్రత



**ఘట్కేసర్, ఆగస్టు 6( జనం సాక్షి ):**విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, సురక్షిత జీవన విధానంపై చైతన్యం పెంపొందించేందుకు అనురాగ్ యూనివర్సిటీలో మాదకద్రవ్యాల వ్యతిరేక, ర్యాగింగ్ నిరోధక, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు సహా 5 వేల మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి రోడ్ సేఫ్టీ డీసీపీ ఐనపర్తి లక్ష్మి, ఈగల్ ఫోర్స్ ఎస్పీ పి. సీతారాం, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ జగన్నాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయం తరఫున స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డా. వి. విజయకుమార్, అసోసియేట్ డీన్ డా. కె.ఎస్. చలపతి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా. వి. శ్రీనివాస్ రావు, డైరెక్టర్ అడ్మిషన్స్ డా. ఎం. శ్రీనివాస్ రావు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కల్నల్ ఆర్. వెంకటేశన్ (రిటైర్డ్), ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. సి. మల్లేశ్‌తో పాటు డీన్లు, హెచ్‌వోడీలు, ఎన్‌సీసీ అధికారులు, ఎన్ఎస్ఎస్ ట్రైనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ఎం. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సరైన ఆలోచనా విధానం, క్రమశిక్షణతోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించగలరని అన్నారు. కల్నల్ ఆర్. వెంకటేశన్ యువత దేశ నిర్మాణంలో బాధ్యతాయుత పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. డీసీపీ ఐనపర్తి లక్ష్మి ర్యాగింగ్ దుష్పరిణామాలు, రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యతను వివరించి, ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ఈగల్ ఫోర్స్ ఎస్పీ పి. సీతారాం, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించి, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన, ర్యాగింగ్ రహిత క్యాంపస్ నిర్మాణం, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. బాధ్యతాయుత పౌరులుగా ఎదగడంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### విబిజీరాంజీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్



**బొంరాస్ పేట, ఆగస్టు 6 (జనం సాక్షి):**తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్,ప్రజాయుద్ధ నౌక గద్దర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారి అడుగుజాడల్లో నడవాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్, విబిజిరాంజీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్ అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన జయశంకర్ జయంతిని పురస్కరించుకొని మండల విద్యా వనరుల కేంద్రం,తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలోని విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరము మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణంలో ప్రజాయుద్ధనౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు సేవలు చిరస్మరణీయమన్నారు. గద్దర్ తన పాటలతో సామాజిక చైతన్యాన్ని రగిలించి, అనగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిలాల్, తపస్ జిల్లా గౌరవ అధ్యక్షులు బాకారం మల్లయ్య, మండల అధ్యక్షులు బాకారం చంద్రశేఖర్, పిఆర్టియు మండల అధ్యక్షులు అనిల్ కుమార్, యుటిఎఫ్ మండలాధ్యక్షులు గౌరారం గోపాల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు నిలయంగా మారిన హైదరాబాద్ నిలోఫోర్ ఆస్పటల్

### హైదరాబాద్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో హాస్పిటల్ ముందు ఆందోళన




**హైదరాబాద్ ఆగస్టు 6 (జనం సాక్షి):**నీలోఫర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అవినీతి అక్రమాలపై విచారణ చేసి అవినీతికి పాల్పడిన సిబ్బంది పై చర్యలు తీసుకోవాలి హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డి వై ఎఫ్ ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావీద్ మాట్లాడుతూ . నీలోఫర్ ఆసుపత్రికి రాష్ట్రంలో మారుమూల గ్రామాల నుండి వైద్యానికి వస్తుంటారు. ఇక్కడ వైద్యం అందిస్తున్న తరుణంలో చికిత్స పొంది డిచార్జ్ అవుతున్న సందర్భంలో ఆస్పత్రికి సంబంధించిన సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. డబ్బులను డిమాండ్ చేయడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. పేద కుటుంబాలకు చెందిన వారే వైద్యానికి వస్తున్న సందర్భంలో ఇక్కడి సిబ్బంది ఇదే అదునుగా భావించి డబ్బులను కాజేస్తున్నారు. ఇలాంటి ఘటనలు చాలా సందర్భంలో జరిగిన కూడా కఠినమైన చర్యలు తీసుకోకపోవడంతో ఇవి మళ్లీ పునరావృతం అవుతున్నాయి. కావున నీలోఫర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించడంతోపాటు అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకొని ఆసుపత్రికి వచ్చే వారికి నమ్మకమైన మెరుగైన వైద్యాన్ని అందించాలని, నిరంతరమైన నిఘాను ఏర్పాటు చేసి అవినీతిని అరికట్టాలన్నారు. బెడ్స్, మూత్ర శాలలు ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేసారు. అనంతరం హాస్పిటల్ సూపర్ డెంట్ విజయ్ కుమార్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్, రాజయ్య, అనిల్ తదితరులు పాలొగొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర చిరస్మరణీయం

## చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి



**చేవెళ్ల, ఆగస్టు 06 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవర సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక ప్రొఫెసర్ జయశంకర్ చేసిన కృషి, త్యాగం, ఉద్యమ స్ఫూర్తి ఎన్నటికీ మరువలేనివని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప మేధావి ఆయన అని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా దశాబ్దాల పాటు ఉద్యమాన్ని సిద్ధాంతపరంగా ముందుకు నడిపించి ప్రజల్లో చైతన్యం నింపిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. తెలంగాణ కోసం తన వ్యక్తిగత జీవితాన్ని సైతం త్యాగం చేసి చివరి శ్వాస వరకు ఉద్యమం కోసం పాటుపడిన గొప్ప వ్యక్తిత్వం జయశంకర్ సార్‌దేనని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి శైలజా ఆగి రెడ్డి, పైండ్ల మధుసూధన్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్తీక్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండాల రాములు, నాయకులు నరేందర్ గౌడ్, విశ్వకర్మ సంఘం నాయకులు, శ్రీనివాస్ చారి, ఆనంద్ చారి, శేఖర్ చారి, రాజు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ సార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## బీఆర్ఎస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్



**చేవెళ్ల,ఆగస్టు 06 (జనంసాక్షి)** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా చేవెళ్ల శంకర్‌పల్లి చౌరస్తాలోని ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దోళ్ల ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు ఆచార్య జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప సిద్ధాంతకర్తగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. జయశంకర్ సార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన అధ్యక్షుడు వంగ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ దూత మల్లేష్, దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రామ గౌడ్, నత్తి కృష్ణారెడ్డి, అనంత్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, చాకలి గూడెం పాండు, కడమంచి ఆనంద్, రామకృష్ణ రెడ్డి, రాంప్రసాద్, దండు సత్యం, జహీద్, తోట చంద్రశేఖర్, షేరి రాజు, ఉపేందర్, పృథ్వీ, మహేందర్, రాజు, బాలు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు బీజేపీ ఉద్యమం

## విద్యార్థులతో సంతకాల సేకరణ



**ఘట్కేసర్ , ఆగస్టు 6 ( జనం సాక్షి ):**ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త "ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్ రూరల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు రాగం అర్జున్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ఆరోరా కళాశాల, చౌదర్‌గూడలోని నల్ల నరసింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో సంతకాల సేకరణ, మిస్డ్ కాల్ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.15 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. పెండింగ్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థుల విద్యాభ్యాసానికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించలేక పలువురు విద్యార్థులు చదువులకు దూరమవుతుండగా, తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించి, మిస్డ్ కాల్ ద్వారా ఉద్యమానికి మద్దతు నమోదు చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కనేబోయిన రాము యాదవ్, మేడ్చల్ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బండారు పవన్ రెడ్డి, ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు బస్వా రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి పోలు భాస్కర్ గౌడ్, మేడిపల్లి డివిజన్ అధ్యక్షుడు జమ్ముల ప్రభాకర్ రెడ్డి, బీజేవైఎం నాయకులు, పార్టీ కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐఎం సీనియర్ నాయకులు కర్నాటి వెంకన్నమృతి

## సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నివాళులు

**రంగారెడ్డి, ఆగస్టు 6 (జనంసాక్షి):**మంచాల మండలం చీదేడు గ్రామ సీపీఐఎం సీనియర్ నాయకులు కర్నాటి వెంకన్న మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తీవ్ర సంతాపం తెలిపారు. వెంకన్న భౌతిక కాయంపై పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు ఆడివయ్య బాటలో నడిచిన కర్నాటి వెంకన్న, నిరుపేదల భూపోరాటాలకు నాయకత్వం వహించారని నాయకులు కొనియాడారు. 1998లో పార్టీలో ఏర్పడిన క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఆయన సీపీఐఎం పక్షాన నిలబడి, వేర్పాటువాదులను తిప్పికొట్టడంలో కీలక పాత్ర పోషించారన్నారు. అదే సంవత్సరంలో మండల పార్టీ కోర్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించి, అప్పట్నుంచి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘంలో వివిధ బాధ్యతలు నిర్వర్తించారన్నారు. తుది శ్వాస విడిచే వరకు సీపీఐఎం గ్రామ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. రంగాపూర్, చీదేడు, జలాల్‌మియా పల్లె రెవెన్యూ పరిధిలో సాగిన డి-ఫారెస్ట్ భూపోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొని చురుకైన పాత్ర పోషించారని జాన్ వెస్లీ పేర్కొంటూ, ఆయన ఆశయాలను కొనియాడారు. వెంకన్న అంత్యక్రియల్లో రాష్ట్ర కార్యదర్శకవర్గ సభ్యులు డి.జి. నర్సింహారావు, జిల్లా కార్యదర్శి యాదయ్య, సీనియర్ రాష్ట్ర నాయకులు పి. జంగారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్, కాడిగళ్ల భాస్కర్, రామచందర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



# కొత్వాల్‌గూడలో ఘనంగా ఆషాఢ బోనాలు జయశంకర్ జయంతి వేడుకలు



**శంషాబాద్, ఆగస్టు6(జనంసాక్షి)):**శంషాబాద్ జిహెచ్ఎంసి కొత్వాల్‌గూడ డివిజన్ హుడా కాలనీలో ఆషాఢ బోనాలు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు కోణమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి చిల్కమర్రి పరంధాములు, ఉపాధ్యక్షులు పెదిరిపాటి మురళిగౌడ్, గుంటి చరణ్, యూత్ అధ్యక్షుడు జివిపి సాగర్, శివగౌడ్, మాడపతి నరేంద్ర, రాహుల్, శ్రీకాంత్, మహేష్, భాస్కర్, సత్యనారాయణ, భారత్, వేణు, జైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్వరాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అమోఘం



**కొడంగల్, ఆగస్టు 06 (జనం సాక్షి):**తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన జయశంకర్ సార్ జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ పాత్ర అమోఘమని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎర్రన్ పల్లి శ్రీనివాస్, రెండవ వార్డ్ కౌన్సిలర్ వాణిశ్రీ మధు సూదన్ యాదవ్,బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మాసాని వెంకటయ్య,అంబేద్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షులు చెవిటి శ్రీనివాస్ లు అన్నారు. జయంతి సందర్భంగా కొడంగల్ లోని అంబేద్కర్ కూడలిలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ధ్యేయంగా కార్యాచరణ రూపొందించి, ప్రజలను మమేకం చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి రమేష్, పర్సాపురం మొగలప్ప,అజయ్ గణేష్,ఇంతియాజ్ వెంకటయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గం చెరువు ప్రభుత్వ పాఠశాలలో బూట్లు బట్టలు పంపిణీ



**మోమిన్ పేట ఆగస్టు 6( జనం సాక్షి)** ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య విద్యార్థులకు అందుతుందని దుర్గం చెరువు గ్రామ సర్పంచ్ లావణ్య మోహన్ అన్నారు, గురువారం,మండల పరిధిలోని దుర్గం చెరువు గ్రామంలో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలిసి సర్పంచ్ లావణ్య మోహన్, ప్రభుత్వం సరఫరా చేసిన బట్టలు బూట్లు పంపిణీ చేశారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులను ఎవరు పంపించవద్దని ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌండ్ల సత్యనారాయణ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కృష్ణ, ఉప సర్పంచ్ లాల్ మహమ్మద్, ఉపాధ్యాయులు వార్డ్ సభ్యులు మహిళా అధ్యక్షులు యాదమ్మ,నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# జయశంకర్ సార్ జయంతి

## ప్రజాయుద్ధనౌక గద్దర్ వర్ధంతి



**కొడంగల్, ఆగస్టు 06 (జనం సాక్షి):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి, ప్రజాయుద్ధనౌకగద్దర్ వర్ధంతి సందర్భంగా కొడంగల్‌లోని నవీన ఆదర్శ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్, గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ డి.వి. నరేష్ రాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు, ప్రజల్లో చైతన్యం నింపడంలో గద్దర్ అందించిన విశిష్ట పాత్రను విద్యార్థులకు వివరించారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు డి. లక్ష్మి వెంకటయ్య, వైస్ ప్రిన్సిపల్ సంతోష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి

### తొలి దశ,మలిదశ తెలంగాణ ఉద్యమ గొప్ప పోరాట యోధుడు



**కొడంగల్ ,ఆగస్టు 06 (జనం సాక్షి):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొడంగల్ లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి మరియు సిబ్బంది ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జయశంకర్ సార్ తొలి దశ మరియు మలిదశ తెలంగాణా ఉద్యమాల్లో పాల్గొన్న గొప్ప పోరాట యోధుడే గాక తెలంగాణ సిద్ధాంత కర్త కూడా అని కీర్తించారు. అతడు తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రజల హక్కు అని నినదించి, ముల్కి – నాన్ ముల్కి, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అను ఉద్యమాలకు నేతృత్వం వహించిన అసలు సిసలైన తెలంగాణ వాది అన్నారు. జయశంకర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తెలంగాణ అభ్యున్నతికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి. రాంబాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఆర్. శ్రీనివాస్, డా. కె. రమేష్ బాబు, డా. ఇ. సోమ్లా, డా. వి. శ్రీధర్ కుమార్, బంటు నర్సిములు, పి. వెంకటయ్య ఇతర అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు వేడుకల్లో కేక్ కటింగ్ బదులు ఒక మొక్క నాటాలి



**బొంరాస్ పేట, ఆగస్టు 6(జనం సాక్షి):** ప్రతి ఒక్కరు పుట్టినరోజు వేడుకల్లో కేక్ కటింగ్ కు బదులు ఒక మొక్క నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు ఉప్పరి జగదీశ్వర్ సాగర్ అన్నారు. గురువారం తన పుట్టినరోజు సందర్భంగా సంగమేశ్వర ఆలయ సమీపంలో మాకే నామ్ పే ఏక్ పెడ్ కార్యక్రమాన్ని నిర్వహించి తల్లి పేరుతో 25 మొక్కలను బిజెపి నాయకులతో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని కోరారు. అంతకుముందు మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు మహేందర్ గౌడ్, అనిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ హాస్టల్ బిల్డింగును పరిశీలించిన వికారాబాద్ జిల్లా పంచాయతీరాజ్ డీఈ



**నవాబుపేట్ ఆగస్టు 6( జనం సాక్షి):** నవాబుపేట్ మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ బిల్డింగ్ ను గురువారంపరిశీలించిన వికారాబాద్ పంచాయతీరాజ్ డి ఈ విష్ణు విద్యను అందుకునే విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం అవసరమని ఉద్దేశించి ప్రభుత్వం ప్రభుత్వం అందించినటువంటి ఎస్సీ హాస్టల్లో బిల్డింగ్ను పరిశీలించి టాయిలెట్ బాత్రూంలో వంట రూమును విద్యార్థులు ఉండే రూమ్లను పరిశీలించి ప్రభుత్వము విద్యార్థులకు హాస్టల్లో ఉన్నటువంటి విద్యార్థులకు బిల్డింగ్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాస్టల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందించినటువంటి ప్రభుత్వం విద్యార్థులకు హాస్టల్లో ఉన్నటువంటి రూములు సరిపోవడం లేదు ఒక్క రూమ్లో 15 నుండి 20 మంది విద్యార్థులు ఉంటున్న సందర్భంగా హాస్టల్లో మొత్తానికి ఒక పది రూములే ఉన్నవి ఆ రూములో విద్యార్థులకు సరిపోయిన పెట్టెలు, దుస్తులు నోట్ బుక్స్ వాటికి రూములు సరిపోతున్న సందర్భంగా విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న సందర్భంగా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోనూ ఉన్నటువంటి హాస్టల్లో విద్యార్థులు సుఖ సంతోషాలతో హాయిగా ఉండాలి రూమ్కు ఒక పదిమంది మాత్రం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నటువంటి హాస్టల్లో విద్యార్థులకు సరిపోని రూములను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అనుసరించి వికారాబాద్ జిల్లా పంచాయతీ రాజ్ డిఈ విష్ణు, నవపేట్ మండల ఏఈ శశి, నవాబ్పేట్ ఎస్సీ హాస్టల్ రత్నం ఆధ్వర్యంలో హాస్టల్ భవనాన్ని అనుసరించారు. హాస్టల్ బిల్డింగ్ రూమ్స్ విద్యార్థులకు సరిపోవడంలేదని నూతనంగా పైన ఇంకొక బిల్డింగ్ను నిర్వహిస్తే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని వారు పేర్కొన్నారు. వెంటనే డి ఈ హాస్టల్ వార్డెన్ తో మాట్లాడుతూ ప్రభుత్వం తొందరలో ఇంకో బిల్డింగు మంజూరు చేయబోతుంది విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా బిల్డింగు తొందరగా మంజూరయ్యే విధంగా ప్రయత్నం చేస్తానని డీఈ తెలిపారు. వెంటనే వార్డెన్ రత్నం మాట్లాడుతూ విద్యార్థులకు రూములు సరిపోవడం లేదు పైన ఇంకొక పోర్షన్ నిర్మించినట్టయితే విద్యార్థులు ఒక్కొక్క రూమ్కు పదిమంది చొప్పున ఉండి విద్యతోపాటు వినయం సంస్కారంతో రూముల్లో హాయిగా ఉంటారని వార్డెన్ రత్నం తెలిపారు. హాస్టల్లో టాయిలెట్ బాత్రూమ్స్ ఐదు టైలర్స్ 5 బాత్రూంలు ఉన్నందున విద్యార్థులకు చాలా ఇబ్బందుల పాలవుతున్నారు వెంటనే వారికి ఇంకొక 5 టాయిలెట్లు 5 బాత్రూంలో 5 వాష్రూమ్లు మంజూరు చేసినట్లయితే విద్యార్థులు హాయిగా ఉంటారని వార్డెన్ రత్నం తెలిపారు. వాడిని రత్నం ఇచ్చిన సమాచారం మేరకు డి విష్ణు వెంటనే హజాత్కారుల మేరకు ఈ సమాచారం అందించి మీ హాస్టల్ కు బిల్డింగు మంజూరయ్యే విధంగా ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇప్పటికీ ఎస్సీ హాస్టల్ లో నీటి సమస్య, బాత్రూం షో, వాష్ రూమ్, ఆడుకోవడానికి ఆట స్థలం లేక విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. వారికి కావలసిన సదుపాయాలను వినియోగించిన రైతే హాస్టల్లో ఇంకా విద్యార్థులు చేరే అవకాశాలు ఉన్నాయని హాస్టల్ వార్డెన్ రత్నం తెలిపారు. ప్రస్తుతం 95మంది విద్యార్థులు హాస్టల్లో ఉన్నారు. వారికి ఇంకా రూమ్లో నూతనంగా ఏర్పాటు చేసినట్లయితే ఇంకా 50 మంది వచ్చే అవకాశాలు ఉన్నాయని వార్డెన్ తెలిపారు. విద్యార్థులకు వారంలో ప్రతిరోజు ఉదయం బ్రేక్ ఫాస్ట్ ఆ రోజులు ఆరు రకాల టిఫిన్స్ పెడుతున్నారు. వారంలో రెండుసార్లు నాన్వెజ్ అందిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం గుడ్డు, మజ్జిగ, స్నాక్స్ విద్యార్థులకు అందిస్తున్న సందర్భంగా విద్యార్థులు హాస్టల్లో రావడానికి ఎంతోమంది సిద్ధంగా ఉన్నారు కానీ వారికి ఉండటానికి రూములు లేక జీవరా ఇబ్బందులతో గురవుతున్నారని హాస్టల్ వార్డెన్ తెలిపారు. ఈ వార్డెన్ ఇచ్చిన సమాచారం మేరకు పంచాయతీరాజ్ డి ఈ తొందరలో మా హాస్టల్ లో ఉన్న సమస్యలను అధికారులకు సమస్యలను అందించి యొక్క హాస్టల్లో ఉన్నటువంటి పేద బలహీన వర్గాల ఆశాజ్యోతి విద్యార్థులకు బిల్డింగ్ను నిర్వహించే విధంగా ప్రయత్నం చేస్తానని వాడడానికి ఆయన హామీ ఇచ్చారు.

# జిల్లా బీజేపీ అధ్యక్షులుగా యు. రమేష్ కుమార్ తొలి నియామకం

### కాళికాదేవి, భద్రేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**తాండూరు అగస్టు 6(జనంసాక్షి):** తాండూర్ నియోజకవర్గం నుండి తొలిసారిగా జిల్లా బీజేపీ అధ్యక్షులుగా నియమితులైన యు. రమేష్ కుమార్ బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా తాండూర్‌లోని ప్రసిద్ధ కాళికాదేవి దేవాలయంలో, అలాగే భద్రేశ్వర స్వామి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు,కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి , బండి సంజయ్, రాజ్యసభ ఎంపీ డా. కె. లక్ష్మణ్,చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,జిల్లా సీనియర్ నాయకులు కరణం ప్రహ్లాద్ రావు, అలాగే రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు, వివిధ మండలాల అధ్యక్షులకు మరియు ఆత్మీయ కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతానని తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని ఆయన అన్నారు. అధ్యక్షుడిగా నియమితులైనందుకు కార్యకర్తలు సంబరాలు చేసుకుని స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమానికి..వెన్నెముక ఆచార్య జయశంకర్

### జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి



**రంగారెడ్డి, ఆగస్టు 6 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి కొనియాడారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆచార్య జయశంకర్ పాత్ర చిరస్మరణీయమన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని, ఉద్యమానికి మార్గదర్శకుడిగా, సలహాదారుడిగా విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలు, అసమానతలపై పోరాటం చేసి ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారని, రాష్ట్ర సాధన కోసం నిరంతరం శ్రమించారని తెలిపారు. అధ్యాపకుడిగా అనేక మంది విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ వృత్తిపట్ల నిబద్ధతను, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించారని ప్రశంసించారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చదువు ప్రతి ఒక్కరి జీవితాన్ని మార్చే శక్తి కలిగిన సాధనమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను పొందేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. విద్య అనేది కేవలం పుస్తక విజ్ఞానానికే పరిమితం కాకుండా జ్ఞానం, విలువలు, క్రమశిక్షణను పెంపొందించేదిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేశురాం, బీసీ సంఘాల నాయకులు మల్లేష్ యాదవ్, కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి

# ఆగస్టు 10న 'జైల్ భరో'ను జయప్రదం చేయండి: పి. అంజయ్య



**యాచారం, ఆగస్టు 06(జనం సాక్షి):** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి. అంజయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని తమ్మాలోనిగూడ గ్రామంలో సీనియర్ నాయకులు ఎస్. జంగారెడ్డి, ఏఐఏడబ్ల్యూయూ మాజీ మండల అధ్యక్షులు కె. జంగయ్యతో కలిసి ఆయన కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి, కార్మిక, రైతు చట్టాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. ఎందరో త్యాగాలతో సాధించిన దేశ స్వతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. ఎర్రజెండాతో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేలా మార్పులు తెచ్చారని, రెండు సార్లు ఫోటో తీసే విధానాన్ని ప్రవేశపెట్టారని ఆరోపించారు. చట్టానికి ఉన్న మహాత్మా గాంధీ పేరును తొలగించి, కరువు కాలంలో కూలీలకు పనులు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీష్ కాలం నాటి నుంచి కార్మికులకు అండగా ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, హక్కులను కాలరాసేలా 4 లేబర్ కోడ్‌లను తెచ్చారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. నూతన వ్యవసాయ చట్టాల వల్ల రైతులు తమ సొంత భూముల్లోనే కూలీలుగా మారే పరిస్థితి వస్తోందని, పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే జైల్ భరోలో ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో జి. లింగం, సత్తయ్య, వెంకటయ్య, రమాదేవి, సత్తమ్మ, రజిని, పాపయ్య, పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

# నల్లగండ్ల వార్డులో పౌర సమస్యలను సమీక్షించిన కమిషనర్




**శేరిలింగంపల్లి, ఆగస్టు 06 (జనంసాక్షి) :** ప్రతిరోజు ప్రతి వార్డు కార్యక్రమంలో భాగంగా గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి నల్లగండ్ల వార్డులో 'వన్ డే వన్ వార్డ్' కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ జి. సృజన శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ తోకలిసి రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ వార్డును సందర్శించి పౌర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన వివిధ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొని సమస్యలను చర్చించారు. వార్డు పరిధిలోని గుల్మోహార్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, స్థానిక ప్రజలు మరియు ప్రజాప్రతినిధులతో సమావేశమై వార్డు పరిధిలోని పౌర సమస్యలను తెలుసుకొని మున్సిపల్ సేవల అమలును సమీక్షించారు. అయితే స్థానికులు స్మార్ట్ వాటర్ డ్రైన్లు, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాలు, సిసి రోడ్లు, పార్కుల అభివృద్ధి, కూడా లేఅవుట్ కాలనీలోని ఆక్రమణల తొలగింపువంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్థానికులు లేవనెత్తిన, చర్చకు వచ్చిన గుర్తించిన అన్ని సమస్యలను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనుల అమలును నిరంతరం పర్యవేక్షించి, చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు 'కంప్లయన్స్ నివేదికలు' సమర్పించాలని సూచించారు. వన్ డే వన్ వార్డ్ కార్యక్రమంద్వారా ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలను సమీక్షించడం, శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం మరియు ప్రజలకు మరింత మెరుగైన మున్సిపల్ సేవలను అందించడం లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎలక్ట్రికల్ ఫీల్డ్ సిబ్బందికి సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. క్షేత్రస్థాయిలో విధులను నిర్వహించే సమయంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచిస్తూ ఫీల్డ్ సిబ్బంది భద్రత, సంక్షేమానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రథమ ప్రాధాన్యతను కల్పిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, యూబిడి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన వసతులు

బొంరాస్ పేట, ఆగస్టు 6 (జనం సాక్షి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తుందని కొత్తూరు గ్రామ సర్పంచ్ సూర్య కళ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన బూట్లను పంపిణీ చేశారు. ఇప్పటికే విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం మధ్యాహ్నం భోజనం అందిస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, ఉప సర్పంచ్ లావణ్య, ప్రధానోపాధ్యాయులు అన్వర్, అంగన్వాడీ టీచర్ శివనీల, మాజీ ఎంపీటీసీ బీంరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు.



# జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

**రాజేంద్రనగర్, ఆగస్టు6(జనంసాక్షి) :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. పిజెటిఏయు లో ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో వ్యవసాయ రంగం కీలకమని, విశ్వవిద్యాలయ అభివృద్ధి, ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశోధనలకు సుమారు రూ. 1,500 కోట్ల నిధులు అవసరమని తెలిపారు. నాబార్డ్ ద్వారా రూ. 850 కోట్లు, కేంద్రం నుంచి రూ. 465 కోట్ల ప్రత్యేక సాయం కోసం ప్రతిపాదనలు సమర్పించినట్లు వెల్లడించారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని ఆకాంక్షించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ వ్యవసాయం సమాజానికి గుండెకాయ వంటిదని, నిరంతర పరిశోధనల ద్వారా కొత్త వంగడాలు, సాంకేతికతను రైతులకు చేరువ చేయాలని సూచించారు. తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ వాతావరణ మార్పులు, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగంతో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేలా నూతన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ సి. హెచ్. వేణుగోపాల రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# తాడిపర్తిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**యాచారం, ఆగస్టు 6: (జనం సాక్షి):** మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీఓ వినీతాదేవి, సూపర్వైజర్ తులసి, గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్, మహిళా సంఘం అధ్యక్షురాలు వెంకటమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ వినీతాదేవి, సూపర్వైజర్ తులసి మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. పుట్టిన శిశువుకు తొలి ఆరు నెలల వరకు తల్లిపాలే అత్యంత ఉత్తమమైన, సంపూర్ణమైన ఆహారమని స్పష్టం చేశారు. తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా లాగా పనిచేస్తూ, రోగనిరోధక శక్తిని పెంచి, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడతాయని వివరించారు. అలాగే తల్లి, శిశువు మధ్య అనుబంధాన్ని ఇవి మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాలపై గ్రామ మహిళలకు, తల్లులకు అర్థమయ్యేలా వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ మహిళలు, పెద్దలు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆచార్య జయశంకర్ సార్ ఆశయాలే తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శకం

### మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి



**చేవెళ్ల, ఆగస్టు 06 (జనంసాక్షి):** ఆచార్య జయశంకర్ సార్ ఆశయాలే తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శకమని చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో గురువారం కమిషనర్ బి.యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆచార్య జయశంకర్ సార్ జీవితాంతం నిస్వార్థంగా పోరాడారని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధనకు చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. అనంతరం "జోహార్ జయశంకర్ సార్" "తెలంగాణ అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజా ఆగిరెడ్డి, దేవర మనీషా రెడ్డి, కరికె మీనాక్షి, పైండ్ల మధుసూధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, పెద్దోళ్ల దయాకర్, దూత మల్లేష్, రాఘవేందర్, మహిళా ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయండి

### శేరిలింగంపల్లి ఈఆర్వో నారాయణ్ అమిత్




**శేరిలింగంపల్లి ఆగస్టు 6 (జనంసాక్షి) :** స్పెషల్ ఎంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియ తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 10 తో ముగియనున్నందున సర్కిల్ అసిస్టెంట్ ఈఆర్వోలు, సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు మరింత వేగంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి జోన్ ఈఆర్ఓ, సీనియర్ ఐఏఎస్ అధికారి నారాయణ్ అమిత్ స్పష్టం చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోన్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన గురువారం ఒక కీలకసర్వపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులంతా హాజరయ్యారు. ఆగస్టు 10తో 'ఎస్ఐఆర్' గడువు ముగియనున్నందున నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి మరింత సమర్థవంతంగా, వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయా అధికారులకు సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఓటర్ల జాబితా సంస్కరణల కోసం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల ముమ్మర సవరణ ప్రక్రియ గడువు ఈనెల ఆగస్టు 10వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన 'ఎస్ఐఆర్' కార్యక్రమం పురోగతిపై ఈఆర్వో నారాయణ్ అమిత్ అధికారులతో కలిసి సమీక్షించారు. తుది గడువు సమీపిస్తున్నందున ఓటరు నమోదు, మార్పులు-చేర్పుల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓటర్ల జాబితా సవరణపై పలు కీలక సలహాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఈఆర్వో నారాయణ్ అమిత్ సానుకూలంగా స్పందిస్తూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చిన అమూల్యమైన సూచనలను స్వీకరించి, వాటికి అనుగుణంగానే పారదర్శకంగా తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఎలాంటి తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు మరియు అధికారులు సమన్వయంతో సహకరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.